# నవజ్యోతి
తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 277 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | ఆదివారం 26-07-2026


### రైతు భరోసాపై చేతివాటం ప్రదర్శించిన ఏఈఓ..!



- రైతుకు రావాల్సిన రూ.90 వేల తన ఖాతాలో జమ.. విచారణలో గుర్తించిన అధికారులు.. సస్పెన్షన్ వేటు..!

8

### ముస్లింల హక్కుల పరిరక్షణకు 'న్యూఢిల్లీ డిక్లరేషన్'

- ఢిల్లీలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్...



3

# హైడ్రోజన్ రైలుతో భారత్ కొత్త చరిత్ర

## 1,200 కిలోమీట్ల విజయయాత్ర

- డీజిల్ వినియోగానికి భారీ ఆదా
- హరిత రవాణాలో భారత్ ముందంజ



**న్యూఢిల్లీ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

శంలోని తొలి హైడ్రోజన్ ఇంధన రైలును జూలై 17న హర్యానాలోని జింద్–సోనిపట్ మార్గంలో ప్రారంభించిన తర్వాత అది విజయవంతంగా 1,200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రయాణం ద్వారా 3,200 లీటర్లకు పైగా డీజిల్ వినియోగాన్ని ఆదా చేసినట్లు తెలిపింది. భారతీయ రైల్వేలో హరిత సాంకేతికతకు ఇది కొత్త అధ్యాయమని పేర్కొంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య జరిగే రసాయనిక చర్య ద్వారా ఈ రైలు విద్యుత్ ను ఉత్పత్తి చేసుకుని నడుస్తుంది. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుండటంతో పొగ, కార్బన్ ఉద్గారాలు ఉండవని కేంద్ర ప్రభుత్వం వివరించింది. పర్యావరణ హిత రవాణా వ్యవస్థకు ఇది కీలక ముందడుగుగా అభివర్ణించింది.

మిగతా 2 లో..

# కార్గిల్ వీరులకు యావత్ దేశం నివాళి



- దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు
- ద్రాస్ వార్ మెమోరియల్‌లో ప్రధాన నివాళి
- అమర జవాన్ల త్యాగస్ఫూర్తిని స్మరించుకున్న భారతం

2

**డెస్క్, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

దేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ కోసం ప్రాణాలను అర్పించిన కార్గిల్ అమరవీరులకు యావత్ భారతం ఆదివారం ఘనంగా నివాళులర్పించనుంది. 1999లో కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం సాధించిన చారిత్రక విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది నిర్వహించే కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం,

### పన్ను వ్యవస్థలో సంస్కరణలకు వేగం



- ఆదాయపు పన్ను దినోత్సవ వేడుకలు
- పన్ను చెల్లింపుదారులకే ప్రాధాన్యం
- సాంకేతికతతో సేవల విస్తరణ

2

## యువతే దేశ భవిష్యత్తు

### రేవంత్

- యువతకు రాజకీయాల్లో అవకాశం
- పోటీ వయసు తగ్గించాలని డిమాండ్
- ప్రత్యేక సమావేశంలో తీర్మానం

2





విద్యార్థుల పోరాటం

### ఫలించింది

### రాహుల్ గాంధీ

- ధర్మేంద్ర రాజీనామా తొలి విజయం
- విద్యార్థుల పోరాటానికి అభినందనలు
- మోదీకి క్షమాపణ డిమాండ్

2



3

## నకిలీ రబ్బర్ ముద్రల వెనుక ముఠా ఉందా..?

- స్టాంపుల తయారీ నుంచి మధ్యవర్తుల దందా వరకు సమగ్ర దర్యాప్తు అవసరం..
- జిల్లాలోని ఇతర ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలపైనా నిఘా పెంచాలనే డిమాండ్



### నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- మర్రిగూడ జంక్షన్‌లో రూ.65 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభం
- ఔటర్ రింగ్ రోడ్డు, తాగునీటి పథకాలకు భారీ నిధుల ప్రతిపాదనలు
- రాష్ట్ర రహదారులను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి

2

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారాన్ని నమ్మొద్దు

- రెండున్నరేళ్లలో 40 శాతం పెరిగిన ఫ్లాట్ల విక్రయాలు
- హైదరాబాద్ పురోగతికి రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వ పిలుపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జులై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, అలాంటి అసత్యాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో టీవీ9 తెలుగు న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్వీట్ హోమ్ రియల్ ఎస్టేట్ ఎక్స్‌పో'ను ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు.

మిగతా 2 లో..





## అలసత్వం అస్సలు సహించను

అధికారులకు చంద్రబాబు హెచ్చరిక

2

# సేవే నిజమైన రాజకీయం

- యువతకు హరీశ్‌రావు పిలుపు
- కేసీఆర్ నాయకత్వాన్ని ప్రశంసించిన నేత
- ప్రజాసేవే రాజకీయ లక్ష్యమన్న వ్యాఖ్య



ప్రజల జీవితాల్లో సానుకూలమార్పు తీసుకురావడమే నిజమైన రాజకీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు.

2

## ధర్మేంద్ర రాజీనామా.. యువత విజయం..

- ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం
- ప్రజల గొంతు గెలిచిందన్న వ్యాఖ్య
- విద్యా వ్యవస్థపై విమర్శలు

2





2

# ఆగస్టు 15లోపు లక్ష ఇంకుడు గుంతలు

## హైడ్రోజన్ రైలుతో భారత్ కొత్త చరిత్ర

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రాజెక్టును పూర్తిగా భారతీయ రైల్వే స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. పది బోగీలతో కూడిన ఈ రైలులో రెండు హైడ్రోజన్ శక్తి యూనిట్లు, లిథియం ఇనుప ఫాస్ఫేట్ బ్యాటరీలు, హైడ్రోజన్ నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జింద్ లో ప్రత్యేక హైడ్రోజన్ నిల్వ, ఇంధన నింపే కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. రైలులో హైడ్రోజన్ లీకేజీ, వేడి, మంటలు, పొగను గుర్తించే బహుళ భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని భద్రతా పరీక్షలు పూర్తిచేసిన అనంతరమే ఈ రైలును ప్రయాణికుల సేవలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. త్వరలో ఢిల్లీ మార్గంలో కూడా ప్రయోగాత్మక సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. హైడ్రోజన్ ఇంధన రైలు కేవలం సాంకేతిక విజయమే కాకుండా దేశంలో స్వదేశీ హైడ్రోజన్ రైల్వే వ్యవస్థ అభివృద్ధికి బలమైన పునాది వేసిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో సున్నా కాలుష్య ఉద్గారాలతో కూడిన రవాణా వ్యవస్థ విస్తరణకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. భారతదేశాన్ని స్వచ్ఛమైన రవాణా రంగంలో ప్రపంచ అగ్రదేశాల సరసన నిలబెట్టే దిశగా ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. హరిత ఇంధన వినియోగం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారతీయ రైల్వే మరో ముందడుగు వేసిందని వెల్లడించింది.<

## ధర్మేంద్ర రాజీనామా.. యువత విజయం..

**వయనాడ్, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

నీట్–యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ అణచివేయలేరని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయమే అంతిమమని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు. శనివారం కేరళలోని తన లోక్‌సభ నియోజకవర్గం వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆమె, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను భావోద్వేగానికి గురి చేసిందని తెలిపారు. గత పదేళ్లుగా దేశ యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని తాను ఎన్నోసార్లు ఆలోచించానని, ఇప్పుడు యువత తమ గళాన్ని బలంగా వినిపించడం ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎంతో కీలకమని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. అన్యాయం జరిగిందని భావించినప్పుడు యువత ఐక్యంగా స్పందించి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం దేశ భవిష్యత్తుకు మంచి సంకేతమని అన్నారు. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. విద్యా వ్యవస్థలో భావజాలాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించడం సరైన పద్ధతి కాదని, చివరికి ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి ప్రభుత్వం గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. నీట్–యూజీ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. పలు విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కూడా విస్తృత స్థాయిలో ఆందోళనలు కొనసాగాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా పలువురు ప్రతిపక్ష నాయకులు, ఉద్యమకారులు అభివర్ణించారు.

## ఆగస్టు 15లోపు లక్ష ఇంకుడు గుంతలు

**హైదరాబాద్, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీలోపు లక్ష ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని అత్యుత్తమంగా సాధించిన అధికారులు, గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానిస్తామని ప్రకటించారు. జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని సూచించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి జిల్లాల వారీగా స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం, మంగళవారం, బుధవారం గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించి వీబీ జీ రాంజీ పరిధిలోని 318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంటకుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట, బోర్‌వెల్ రీచార్జ్ వంటి నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పేర్కొన్నారు. మండల స్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు మిషన్ భగీరథ సహాయ ఇంజినీర్, పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్, మండల అభివృద్ధి అధికారి, అదనపు కార్యక్రమ అధికారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## అలసత్వం అస్సలు సహించను

**ఆలూరు, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్ర పాలనలో నిర్లక్ష్యానికి, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజాధనం వృథా కావడం, ప్రజలకు ప్రభుత్వ సేవలు ఆలస్యంగా అందడం ఏమాత్రం సహించబోమని హెచ్చరిస్తూ, అధికారుల పనితీరు మెరుగుపడాలని సూచించారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన చంద్రబాబు, రాయలసీమ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం రెండేళ్లలోనే సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వెచ్చించిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు ఇకపై అవకాశం ఉండదని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. రౌడీయిజం, మహిళలపై వేధింపులు, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో రాయలసీమ ఫ్యాక్షన్ రాజకీయాలకు నిలయంగా ఉండేదని, ప్రస్తుతం శాంతి వాతావరణం నెలకొల్పామని తెలిపారు. అనంతరం ఆలూరు నియోజకవర్గంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, ప్రజా సేవలపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, 42 రకాల సేవలకు సంబంధించిన గణాంకాలను పరిశీలించారు. అన్న క్యాంటీన్లు, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, రీ సర్వే, మధ్యాహ్న భోజన పథకం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ వంటి అంశాల్లో పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అధికారులను నిలదీశారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారికి పరిస్థితిని వెంటనే మెరుగుపరచాలని ఆదేశించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలాగే ఆర్టీసీ బస్సు సర్వీసుల నిర్వహణపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, నెల రోజుల్లో పరిస్థితి మెరుగుపడకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు

**మొదటిపేజీ తరువాయి**

త్రివిధ దళాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ ఐక్యత, దేశభక్తి స్ఫూర్తిని చాటిచెప్పే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లడఖ్‌లోని ద్రాస్ కార్గిల్ వార్ మెమోరియల్‌లో ప్రధాన కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించనున్నారు. త్రివిధ దళాల అధికారులు, మాజీ సైనికులు, వీర జవాన్ల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. దేశ రాజధాని సహా వివిధ రాష్ట్రాల్లోని యుద్ధ స్మారక చిహ్నాల వద్ద కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 1999లో పాకిస్థాన్‌కు చెందిన చొరబాటుదారులు కార్గిల్ ప్రాంతంలోని వ్యూహాత్మక పర్వత శిఖరాలను ఆక్రమించడంతో యుద్ధం ప్రారంభమైంది. అనంతరం భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' చేపట్టి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో శత్రువులను తరిమికొట్టి ఆక్రమిత ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంది. ఎత్తైన మంచు పర్వతాలు, తీవ్ర చలి, ఆక్సిజన్ కొరత వంటి ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా భారత జవాన్లు ప్రదర్శించిన అసాధారణ సాహసం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. కార్గిల్ యుద్ధంలో అనేక మంది భారత సైనికులు వీరమరణం పొందగా, మరెందరో తీవ్రంగా గాయపడ్డారు. దేశ రక్షణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరుల త్యాగాలను చిరస్థాయిగా గుర్తుంచుకునేందుకే ప్రతి ఏడాది జూలై 26ను కార్గిల్ విజయ్ దివస్‌గా నిర్వహిస్తున్నారు. వారి సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలాపనలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చింది. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలను గౌరవించాలని, జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని సూచించింది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల్లోని యుద్ధ స్మారక చిహ్నాల వద్ద ప్రత్యేక నివాళి కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. దేశవ్యాప్తంగా మాజీ సైనిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి.

## నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**నల్గొండ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

నల్గొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండలోని మర్రిగూడ జంక్షన్ వద్ద రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నగర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మర్రిగూడ జంక్షన్ ఫ్లైఓవర్‌ను హైదరాబాద్‌లోని ఆధునిక ఫ్లైఓవర్ల తరహాలో అందమైన పెయింటింగ్స్, కళాకృతులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దామని మంత్రి తెలిపారు. ఈ ఫ్లైఓవర్‌తో నగరంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రమాదాల నివారణతో పాటు నగర సౌందర్యం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. నల్గొండ నగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.750 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే భారీ వాహనాలు నగరంలోకి రాకుండా మళ్లించడంతో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని, నగరాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. నల్గొండ చుట్టుపక్కల గ్రామాల్లో మట్టి రోడ్లు లేకుండా పూర్తిగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రూ.300 కోట్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

## యువతే దేశ భవిష్యత్తు

**హైదరాబాద్, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన చట్ట సవరణను పార్లమెంట్‌లో తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆగస్టు తొలి వారంలో రాష్ట్ర శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశపరచి పోటీ వయోపరిమితి తగ్గింపుపై తీర్మానం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర శాసనసభ నుంచి ఏకగ్రీవంగా తీర్మానం పంపించడం ద్వారా దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. "యువతే దేశం – దేశమే యువత" పేరుతో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ముఖ్యమంత్రి, నీట్ పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు న్యాయం జరిగే విధంగా వ్యవస్థలో సంస్కరణలు అవసరమని అన్నారు. 21 ఏళ్లకే యువత ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అత్యున్నత సేవల్లో చేరుతున్నప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీలు కావడానికి అవకాశం ఎందుకు ఉండకూడదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. లోక్‌సభ, శాసనసభలకు 21 ఏళ్లకే, రాజ్యసభకు 25 ఏళ్ల వయస్సుతో పోటీ చేసేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని సూచించారు. చట్టసభల్లో యువత గళం బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అలాగే మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అదే స్ఫూర్తితో ఇప్పుడు శాసనసభ, లోక్‌సభ ఎన్నికల విషయంలో కూడా సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు.

## సేవే నిజమైన రాజకీయం

**హైదరాబాద్, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

రాజకీయం అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం, అధికారం చేపట్టడం మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన రాజకీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. 99టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టేట్స్‌మ్యాన్ ఎక్సలెన్స్ అవార్డ్స్–కాంక్లేవ్'లో 'పాలిటిక్స్ బియాండ్ పవర్' అంశంపై మాట్లాడుతూ యువతను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. నేటి యువత రాజకీయాన్ని ఎన్నికలు, సామాజిక మాధ్యమాలు, విమర్శలకే పరిమితం చేసి చూస్తోందని హరీశ్‌రావు అన్నారు. కానీ రైతుకు నీరు, విద్యార్థికి విద్య, యువతకు ఉపాధి, ప్రజలకు మెరుగైన వైద్యం, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు అందించడమే అసలైన రాజకీయమని పేర్కొన్నారు. అధికారం అనేది ప్రజాసేవకు ఒక సాధనం మాత్రమేనని, సేవే అంతిమ లక్ష్యంగా ఉండాలని చెప్పారు. తెలంగాణ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, ఒక గొప్ప లక్ష్యానికి బలమైన నాయకత్వం, యువత శక్తి కలిస్తే చరిత్ర సృష్టించవచ్చని అన్నారు. తెలంగాణ సాధన అసాధ్యమని భావించిన సమయంలో కేసీఆర్ తన నాయకత్వం, దీక్షతో ఉద్యమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత తమ వ్యక్తిగత భవిష్యత్తును పక్కనబెట్టి ఉద్యమంలో పాల్గొనడం వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల కోసం బాధ్యతాయుతంగా పనిచేయవచ్చని హరీశ్‌రావు అన్నారు. దేవాదుల ప్రాజెక్టు పంపులను ప్రారంభించేందుకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందేలా చేశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పాత్ర అని వ్యాఖ్యానించారు. నేటి యువత సంకల్పిస్తే వ్యవస్థల్లో మార్పు తీసుకురాగలదని ఆయన అన్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారాన్ని నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా వివిధ రియల్ ఎస్టేట్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలోనే రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పుంజుకుందని మంత్రి స్పష్టం చేశారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే వారి ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. గడిచిన రెండున్నరేళ్లలో దాదాపు 15 నుంచి 20 శాతం వరకు రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి సాధించిందని, ఫ్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు వృద్ధి చెందాయని గణాంకాలతో వివరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన డాక్యుమెంట్ల సంఖ్య మరియు ఆదాయమే ఈ అద్భుతమైన వృద్ధికి ప్రత్యక్ష నిదర్శనమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక విధానాల వల్లే రియల్ ఎస్టేట్ రంగంలో ఈ తరహా వృద్ధి సాధ్యమైందని చెప్పారు. ప్రపంచంలోనే సుందర నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్‌ను రియల్ ఎస్టేట్ పరంగా కూడా మరిన్ని ఎత్తులకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్‌ను మరింత సుందరంగా, వేగవంతంగా అభివృద్ధి చేయడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు, బిల్డర్లు ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు. ఇళ్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ప్రజల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత సంస్థలపై ఉందన్నారు. కొనుగోలుదారులకు సకాలంలో నాణ్యమైన ఫ్లాట్లను అందించి, వారి అభిమానాన్ని చూరగొనాలని ఆయన రియల్టర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, టీవీ9 నెట్‌వర్క్ వైస్ ప్రెసిడెంట్ నరసింహాచారిలతో పాటు పలువురు ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు మరియు పెద్ద సంఖ్యలో సందర్శకులు పాల్గొన్నారు.

## పన్ను వ్యవస్థలో సంస్కరణలకు వేగం

**న్యూఢిల్లీ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఆధ్వర్యంలో 167వ ఆదాయపు పన్ను దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందనాత్మక పన్ను పరిపాలనకు సంబంధించిన ఐదు కీలక సూత్రాలను వివరించారు. పన్ను వ్యవస్థలో స్పష్టత పెంచడంతో పాటు న్యాయ వివాదాలను తగ్గించే దిశగా మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు న్యాయమైన, సమర్థవంతమైన, పారదర్శకమైన, సేవా దృక్పథంతో కూడిన పరిపాలన అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పన్ను వ్యవస్థను మరింత సరళీకృతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, ఆదాయపు పన్ను చట్టం–2025తో పాటు కొత్త నిబంధనలు, దరఖాస్తు నమూనాలు దేశ పన్ను వ్యవస్థలో చారిత్రాత్మక సంస్కరణలకు నాంది పలికారని తెలిపారు. వీటి ద్వారా పన్ను చెల్లింపుదారులకు మరింత సులభమైన, అనుకూలమైన విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.<ప్రత్యక్ష పన్నుల మండలి సాంకేతిక ఆధారిత పన్ను పరిపాలనను మరింత విస్తరిస్తోందని అధికారులు తెలిపారు. శాశ్వత ఖాతా సంఖ్య 2.0, ఆదాయపు పన్ను వ్యాపార అనువర్తనం 2.0, సమాచార–విద్య–ప్రసార వ్యవస్థ 3.0, సక్షమ్ నడ్జ్ వంటి ఆధునిక వేదికల ద్వారా సేవలను మరింత వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. డిజిటల్ సాంకేతికత వినియోగంతో పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన సేవలు అందించడంతో పాటు పారదర్శకతను పెంచే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. వివాదాలను తగ్గించడం, స్వచ్ఛంద పన్ను చెల్లింపులను ప్రోత్సహించడం, ప్రజలకు సులభమైన సేవలు అందించడం ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థుల పోరాటం ఫలించింది

**న్యూఢిల్లీ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశ విద్యా వ్యవస్థను తిరిగి సరైన మార్గంలోకి తీసుకురావడానికి ఇది ఒక కీలకమైన తొలి అడుగని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, తమ భవిష్యత్తు కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్వంగా ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. యువత తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడి ప్రజాస్వామ్య పద్ధతిలో విజయాన్ని సాధించారని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతలోనే ఉందని, వారి గళాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయలేరని వ్యాఖ్యానించారు. అయితే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోనే ఈ అంశం ముగిసిపోలేదని రాహుల్ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. నీట్ ఆందోళనల సందర్భంగా నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన హింస, లాఠీఛార్జీలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ రెండు ప్రధాన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేస్తూ, బాధ్యులైన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం పాలనలో రైతులు, కూలీలు, పేదలు, యువత సహా అనేక వర్గాలు అన్యాయానికి గురయ్యాయని రాహుల్ ఆరోపించారు. తమ ఆత్మగౌరవం, హక్కులు, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రజలు రాజ్యాంగబద్ధంగా ఐక్యంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే ప్రజాస్వామ్య బలం ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# నకిలీ రబ్బర్ ముద్రల వెనుక ముఠా ఉందా..?

- **స్టాంపుల తయారీ నుంచి మధ్యవర్తుల దందా వరకు సమగ్ర దర్యాప్తు అవసరం..**
- **జిల్లాలోని ఇతర ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలపైనా నిఘా పెంచాలనే డిమాండ్**



**కామారెడ్డి, జులై 24 (నవజ్యోతి ప్రతినిధి):**

కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ దరఖాస్తుల్లో ప్రభుత్వ వైద్యాధికారి నకిలీ సంతకం, అధికారిక రబ్బర్ ముద్ర వినియోగం వెలుగులోకి రావడంతో ఇప్పుడు దర్యాప్తు మొత్తం నకిలీ రబ్బర్ ముద్రల తయారీ, వాటి వినియోగం, మధ్యవర్తుల వ్యవస్థ చుట్టూనే తిరుగుతోంది. ఒక ఇంటర్నెట్ కేంద్రం ద్వారా ఈ వ్యవహారం బయటపడడంతో జిల్లాలోని ఇతర ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాల పనితీరుపై కూడా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీసు, న్యాయస్థానాలు జారీ చేసే పత్రాల్లో అధికారిక రబ్బర్ ముద్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. గెజిటెడ్ అధికారి సంతకంతో పాటు అధికారిక ముద్ర కూడా ఉన్నప్పుడే అనేక పత్రాలు చెల్లుబాటు అవుతాయి. అలాంటి ముద్రనే నకిలీగా తయారు చేసి వినియోగించడం ప్రభుత్వ ధ్రువీకరణ వ్యవస్థను మోసం చేయడమేనని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ కేసులో ప్రధానంగా తలెత్తుతున్న ప్రశ్నలు అనేకం. అధికారిక రబ్బర్ ముద్ర ఎక్కడ తయారైంది? ఎవరు తయారు చేశారు? ఎలాంటి ఆధారాలతో తయారు చేశారు? అసలు ముద్రను స్కాన్ చేసి రూపొందించారా? లేక డిజిటల్ డిజైన్ ఆధారంగా తయారు చేశారా? అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లు, ఇతర డిజిటల్ పరికరాల్లో ఈ వ్యవహారానికి సంబంధించిన కీలక ఆధారాలు లభించే అవకాశం ఉందని సమాచారం.

ప్రస్తుతం లేజర్ టెక్నాలజీతో కొద్ది నిమిషాల్లోనే రబ్బర్ ముద్రలు తయారు చేసే అవకాశం ఉంది. వ్యక్తిగత, వ్యాపార సంస్థల ముద్రలతో పోలిస్తే ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ అధికారులు, కోర్టులు, ప్రభుత్వ ఆసుపత్రుల పేర్లతో కూడిన ముద్రలు తయారు చేసే సమయంలో అదనపు జాగ్రత్తలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. అయితే దేశవ్యాప్తంగా అధికారిక ముద్రల తయారీపై ఒకే విధమైన నియంత్రణ వ్యవస్థ లేకపోవడం కూడా ఆందోళన కలిగించే అంశంగా మారింది.

ఈ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం అధికారిక రబ్బర్ ముద్రల తయారీకి ప్రత్యేక మార్గదర్శకాలు తీసుకురావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ శాఖల పేర్లతో ముద్రలు తయారు చేసే ముందు అధికారిక అనుమతి పత్రం పరిశీలించడం, ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి పూర్తి వివరాలు నమోదు చేయడం, ముద్ర డిజైన్, తేదీ, మొబైల్ నంబర్ వంటి వివరాలను రికార్డుగా భద్రపరచడం, అనుమానాస్పద ఆర్డర్లపై సంబంధిత శాఖలకు సమాచారం అందించే విధానం తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఈ కేసులో ఒక ఇంటర్నెట్ కేంద్రం పేరు బయటకు రావడంతో జిల్లాలోని ఇతర జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాల వ్యవహారాలపై కూడా చర్చ మొదలైంది. గతంలో వివిధ పత్రికల్లో కొన్ని ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలపై ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయిస్తామని, భూముల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తిచేస్తామని, ప్రభుత్వ పథకాలు మంజూరు చేయిస్తామని చెప్పి మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. అయితే ఆ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిగిందా లేదా అన్నది ఇప్పటికీ స్పష్టతకు రాలేదని స్థానికులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం నమోదైన కేసును కేవలం ఒక కేంద్రానికే పరిమితం చేయకుండా, జిల్లాలోని ఇతర ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలపై కూడా పోలీసులు, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ అధికారుల పేర్లతో నకిలీ ముద్రలు, డిజిటల్ ఫైళ్లు, నకిలీ ధ్రువపత్రాలు సిద్ధం చేస్తున్నారా? ప్రభుత్వ పథకాల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారా? ప్రభుత్వ కార్యాలయాల్లో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

అయితే అన్ని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను ఒకే కోణంలో చూడకూడదని, చట్టబద్ధంగా సేవలు అందిస్తున్న కేంద్రాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయని గుర్తించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను మాత్రమే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటే నిజాయితీగా పనిచేస్తున్న నిర్వాహకులకు కూడా రక్షణ లభిస్తుందని అంటున్నారు.

నిపుణుల అభిప్రాయం ప్రకారం భవిష్యత్తులో ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం సంతకం, రబ్బర్ ముద్రలపై ఆధారపడకుండా ప్రతి ధ్రువపత్రానికి క్యూఆర్ కోడ్, డిజిటల్ వెరిఫికేషన్, ఈ-సిగ్నేచర్, యూనిక్ వెరిఫికేషన్ నంబర్ వంటి వ్యవస్థలను తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రతి ప్రభుత్వ అధికారి అధికారిక ముద్రకు డిజిటల్ రిజిస్ట్రేషన్, ట్రాకింగ్ విధానం తీసుకువస్తే నకిలీ ముద్రల తయారీకి గణనీయంగా అడ్డుకట్ట పడే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

ప్రజలు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లోనే దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ పనులు చేయిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, అనుమానాస్పద పత్రాలు, నకిలీ ముద్రలు, అక్రమ వసూళ్లు లేదా మోసపూరిత కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత శాఖలకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఈ కేసులో నకిలీ ముద్రల తయారీ నుంచి వాటి వినియోగం, మధ్యవర్తుల పాత్ర, గతంలో జరిగిన ఇలాంటి వ్యవహారాలు అన్నింటినీ సమగ్రంగా దర్యాప్తు చేసినప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# భారత ముస్లింల సమస్యలు, భవిష్యత్ దిశపై జాతీయ చర్చ

- **న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న షబ్బీర్ అలీ..**

**న్యూఢిల్లీ / హైదరాబాద్ జులై 24 (నవజ్యోతి ప్రతినిధి):**



భారత ముస్లింల ప్రస్తుత పరిస్థితిపై చర్చించేందుకు న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన జాతీయ సంప్రదింపుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మాజీ రాజ్యసభ సభ్యుడు మహ్మద్ అదీబ్, జమ్మూ-కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి డా. ఫరూక్ అబ్దుల్లా, మాజీ కేంద్ర విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు పలువురు ముస్లిం మేధావులు, విద్యావేత్తలు, సామాజిక నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో భారత ముస్లింల ప్రస్తుత సామాజిక, విద్యా, రాజ్యాంగపరమైన పరిస్థితులతో పాటు జాతీయ స్థాయిలో వారికి సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి అభిప్రాయాలు పంచుకున్నారు. సమాజాభివృద్ధి, విద్యా అవకాశాల విస్తరణ, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, దేశాభివృద్ధిలో ముస్లిం సమాజం భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఎస్ఐఆర్‌లో అర్హుల ఓట్లు తొలగించొద్దు

- **ప్రతి గ్రామంలో ఓటరు జాబితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీఆర్ ఎస్ నాయకులకు గంప గోవర్ధన్ సూచన...**

**భిక్కనూర్, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**



రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) కార్యక్రమంపై భిక్కనూర్ మండల బీఆర్ ఎస్ నాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాల పరిశీలన, గ్రామాల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రజలకు అవగాహన కల్పించడం, పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ ఎస్ ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డూప్లికేట్, అనర్హ ఓట్లను మాత్రమే తొలగించాలని, అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని కోరారు. ప్రతి గ్రామంలో ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకునేలా పార్టీ నాయకులు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని గోవర్ధన్ నాయకులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హ ఓటరి హక్కు పరిరక్షణ కోసం బీఆర్ ఎస్ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తునికి వేణు, పెద్ద మల్లారెడ్డి సర్పంచ్ సాయ గౌడ్, రామేశ్వర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ భూం రెడ్డి, రామచంద్రం, హనుమంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితర బీఆర్ ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఎస్ ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అండగా నిలవాలని సమావేశంలో నిర్ణయించారు.

# తిమ్మాపూర్ టిటిడీలో తొలి ఏకాదశి వేడుకల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డి

## రూ.70 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యమని వెల్లడి...





**బీర్కూర్, కామారెడ్డి జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం (TTD)లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీర్కూర్, వర్ని మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కొండ కింద నుంచి ఆలయం వరకు కాలి నడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.20 లక్షలతో మెట్ల మార్గం, రూ.50 లక్షలతో లైనింగ్ వాల్ నిర్మాణానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన మార్గం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# ముస్లింల హక్కుల పరిరక్షణకు 'న్యూఢిల్లీ డిక్లరేషన్'

## ఢిల్లీలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్...



**న్యూఢిల్లీ/ హైదరాబాద్ జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

ముస్లింల హక్కుల పరిరక్షణపై రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ది అసర్షన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ముస్లిమ్స్' అంశంపై శనివారం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR), దాని ప్రభావం, పౌరుల హక్కుల పరిరక్షణతో పాటు ముస్లింలు మరియు ఇతర బలహీన వర్గాల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన అవసరంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, మాజీ రాజ్యసభ సభ్యుడు మహ్మద్ అదీబ్, మాజీ కేంద్ర విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు పలువురు ప్రముఖులు, మేధావులు, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి వేళ భక్తిజన సంద్రంగా శ్రీ దుర్గా మల్లేశ్వర ఆలయం

- **భక్తుల రాకతో కిటకిటలాడిన గ్రీన్ హిల్స్ ఆలయం**
- **వాసుదేవ భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం**



**కుత్బుల్లాపూర్, జులై 25: (నవజ్యోతి ప్రతినిధి)**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీలో వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం తొలి ఏకాదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. పవిత్రమైన ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము ఐదు గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.<స్వామివారికి విశేష పుష్పాలంకరణతో పాటు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు తదితర సౌకర్యాలను కల్పించి పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా సాగేలా చర్యలు చేపట్టారు. అనంతరం భక్తులంతా సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి భక్తిరసంలో మునిగిపోయారు. తొలి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వాసుదేవ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున హాజరై ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, చంద్రయ్య, వీరన్న, శ్రీనివాసరావు, శ్రీనివాస్ కుమార్, హరిబాబు, లవకుశ, సురేష్, రాంబాబు, టీడీ రావు, రామాంజనేయులు, శ్రీకాంత్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# 100వ వారానికి చేరిన హనుమాన్ చాలీసా పారాయణం

## తొలి ఏకాదశి రోజున దాసాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు..



**భిక్కనూరు జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో గత కొంతకాలంగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణం శనివారం 100వ వారానికి చేరుకుంది. ఈ 100వ వారం తొలి ఏకాదశి రోజున రావడంతో భక్తులు దీనిని విశేష పుణ్య సందర్భంగా భావించి పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. కార్యక్రమం నిరంతరం విజయవంతంగా కొనసాగాలని భక్తులు ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్లలో చైతన్యం... పారిశుధ్యంపై అవగాహన

## ప్రజల మధ్యకు కళాబృందాలు..ఓటరు నమోదు, పారిశుధ్యంపై సందేశం

## చింతల్ నుంచి పద్మనగర్ వరకు చైతన్య యాత్ర



**కుత్బుల్లాపూర్, జూలై 25: (నవజ్యోతి ప్రతినిధి)**

జీడిమెట్ల సర్కిల్-55 పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ( ఎస్ఐఆర్ - 2026) కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు, అలాగే పారిశుధ్యం, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం కళాబృందాల ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు చింతల్ యల్లమ్మ ఆలయం సమీపంలో, సాయంత్రం 6.00 గంటలకు పద్మనగర్ రింగ్ రోడ్ వద్ద కళాజాత ప్రదర్శనల ద్వారా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు వివరించారు. అదే సమయంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సందేశం అందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, ఓటర్లు విశేషంగా స్పందించారు. ప్రజా చైతన్య కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా చేరుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏఈఆర్ఓ, జీడిమెట్ల సర్కిల్-55 డిప్యూటీ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# పచ్చని కూకట్ పల్లి కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, జూలై 25, ( నవజ్యోతి ప్రతినిధి):**




హైదరాబాద్ నగరం పచ్చటి హరితవనంగా మారాలంటే ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటి, వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ఏడాది వ్యవధిలో 16 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. ఈ ప్రణాళికకు అనుగుణంగా ప్రభుత్వ నర్సరీల ద్వారా మొక్కల పంపిణీ వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పిలుపుతో ప్రేరణ పొంది, కూకట్‌పల్లి నియోజకవర్గం వసంతనగర్ డివిజన్ పరిధిలోని గోపాలనగర్ కాలనీ పార్కు ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.హెచ్ఎండీఏ డైరెక్టర్ రోహిత్, అసిస్టెంట్ డైరెక్టర్ చక్రపాణి సహకారంతో, మండలపు రోజారమణి ట్రస్ట్ నిర్వాహకుడు, కాంగ్రెస్ నాయకుడు సాయిబాబా చౌదరి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలో మొక్కలు నాటి, కాలనీ వాసులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు.అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ... 'వృక్షో రక్షతి రక్షతః' సూక్తిని ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి కుటుంబం కనీసం నాలుగైదు మొక్కలైనా పెంచాలని కోరారు. చిన్నారుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో స్థానిక నాయకులు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసబాబు, అరవింద్ రెడ్డి, రంగమోహన్, శివ, ప్రవీణ్, రామకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీని పార్టీ కార్యాలయంగా మార్చే ప్రయత్నమంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు.

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియామకానికీ వినతి
- బీజేపీ కౌన్సిలర్ల తీరుపై మండిపడ్డ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌ను బీజేపీ కౌన్సిలర్లు పార్టీ కార్యాలయంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజల అభివృద్ధి పనులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సహచర కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గిరికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఇదే సందర్భంగా మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరుతూ మరో వినతిపత్రాన్ని కూడా సమర్పించారు. ఈ సందర్భంగా ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టణ ప్రజల అభివృద్ధి కోసం పాలకపక్షం తీసుకొస్తున్న ప్రతి ఎజెండాను బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి సభను సజావుగా సాగనివ్వకుండా అడ్డుకుంటున్నారని, అనంతరం బయటకు వచ్చి పాలకపక్షంపైనే విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు వంటి అభివృద్ధి పనులను కూడా అడ్డుకుంటూ, తమకు నచ్చిన పనులకే ఆమోదం తెలపాలని ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి తమకు అనుకూలమైన పనులకే ఆమోదం పొందాలని చూస్తున్నారని, కమిషన్ల రాజకీయాలు చేస్తూ కౌన్సిల్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కామారెడ్డి పట్టణ అభివృద్ధికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ప్రత్యేక నిధులు కూడా తీసుకురాలేదని, మున్సిపల్ అధికారులపై అవినీతి ముద్ర వేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం బీజేపీ పార్టీ కార్యాలయం కాదని, చిల్లర రాజకీయాలు మానుకుని పట్టణ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదని, అవసరమైతే ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.

# నీట్ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలి

- డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ...



**కామారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, దేశవ్యాప్తంగా కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమాలకు సంఘీభావంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, లోక్‌సభలో నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చ నిర్వహించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని, వారి న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ కార్యకర్తలు, విద్యార్థులు, యువత, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రీన్ హిల్స్ సమస్యలు..కమిషనర్ అజెండాలోకి

- కమిషనర్ పర్యటనలో గ్రీన్ హిల్స్ సమస్యలు తెరపైకి
- గ్రీన్ హిల్స్ కు కమిషనర్ హామీ..పరిష్కారంపై ఆశలు

**కుత్బుల్లాపూర్, జూలై 23 (నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రజల వద్దకే పరిపాలనను తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'వన్ వార్డ్- ఎవరీ డే' కార్యక్రమం గురువారం 294వ డివిజన్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన వార్డులో పర్యటిస్తూ పారిశుధ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీ అధ్యక్షుడు అమర్నాథ్ నేతృత్వంలో కాలనీ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి, కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి నిల్వలు, అంతర్గత మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వినతిపత్రాన్ని అందజేస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన కమిషనర్ డాక్టర్ జి. సృజన సమస్యలను శ్రద్ధగా విన్నారు. సంబంధిత ఇంజినీరింగ్, డ్రైనేజీ విభాగాల అధికారులతో సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన



# తాండకు దారి అడుగుతోంది...అభివృద్ధికి బ్రేక్ ఎందుకు?

- ప్రభుత్వం మారింది... తాండ అభివృద్ధి ఆగింది!
- తాండను చేరని అభివృద్ధి..జోనల్ కమిషనర్‌కు మాజీ కౌన్సిలర్ వినతి

**కుత్బుల్లాపూర్, జూలై 25: (నవజ్యోతి ప్రతినిధి)**

అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచి పోవడం, ప్రత్యామ్నాయ రహదారి లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతుండటంతో దుండిగల్ సర్కిల్ పరిధిలోని తాండ-2 సమస్యలను మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పునఃప్రారంభించి, తాండ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని రాతపూర్వక వినతిపత్రం సమర్పించారు. మాజీ కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ద్వారా రూ.1.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని, ప్రభుత్వం మారిన తర్వాత ఆ పనులు రద్దు కావడంతో తాండ అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందని ఆయన వివరించారు. డ్రైనేజీ పనులు పూర్తయినా, వాటి తర్వాత వేయాల్సిన రోడ్లు ఇప్పటికీ నిర్మించకపో వడంతో ప్రజలు బురద, దుమ్ము మధ్యనే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా తాండ-2 నుంచి బయటకు వెళ్లేందుకు ఒకే ఒక్క రహదారి ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాండ-2 నుంచి హెచ్ఎంటీ సొసైటీ మీదుగా తాండ-1 వరకు, అక్కడి నుంచి సర్వీస్ రోడ్డు వరకు కొత్త రహదారిని మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే వేలాది మంది ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుందని, ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు అత్యవసర సేవలు కూడా వేగంగా చేరుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిలిచిపోయిన పనులను తక్షణమే పునరుద్ధరించాలని, తాండ అభివృద్ధిని మళ్లీ గాడిలో పెట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు శంకర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీందర్ నాయక్, అమర్ సింగ్ నాయక్, హెచ్ఎంటీ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఫామ్‌ల్యాండ్ పేరుతో మోసాలు.. చర్యలు తీసుకోవాలని బాధితుల విజ్ఞప్తి

**సంగారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం నాగల్గిద్ద పరిసర ప్రాంతాల్లో ఫామ్‌ల్యాండ్ పేరుతో అమాయక ప్రజలను మోసగిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఎస్ఎస్‌వీ గ్రీన్ స్టోన్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో ఫామ్‌ల్యాండ్ పేరిట తక్కువ ధరలకు భూములు ఇస్తామని ప్రచారం చేసి, హైదరాబాద్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకొస్తున్నారని తెలిపారు. బాధితుల కథనం ప్రకారం, స్థలాలు చూపించి వెంటనే బుకింగ్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, బుకింగ్ చేయడానికి నిరాకరిస్తే వారిని అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. ఇటీవల ఓ దంపతులను భూములు చూపించిన అనంతరం అక్కడే వదిలివేయడంతో, వారు ఆటోలో పిట్లం చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. గుంటల వారీగా భూములు విక్రయిస్తామని, అభివృద్ధి చేసిన వెంచర్‌గా ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, అక్రమాలు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ఎగువపల్లి భజన భక్తులు వర్షం కోసం
# మూడు రోజుల పాటు నిత్యం భజనలు

- **వర్షం కోసం గ్రామ దేవతకు 101 కడవల నీటితో అభిషేకం**

**లింగాల జులై 25 నవజ్యోతి ప్రతినిధి**



ఎగువపల్లి గ్రామంలో మూడు రోజులపాటు అహర్నిశలు రామభక్తులు తిరుగు భజనతో భక్తి గీతాలు ఆలకిస్తున్నారు వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొనాలని కోరుతూ లింగాల మండలంలోని ఎగువపల్లి గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా మూడు రోజులపాటు ప్రత్యేక భక్తి దీక్షలను చేపట్టారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు రాత్రింబవళ్లు తిరుగు భజనలు నిర్వహిస్తూ ఆ వరుణ దేవుడు భక్తి పారవశ్యంలో మునిగిపోయి వర్షాలు సమృద్ధిగా కురిపించలని అహర్నిశలు భక్తి గీతాలు ఆలపించారు . ఈ సందర్భంగా గ్రామ దేవత అయిన పెద్దమ్మ తల్లికి 101 కడవల నీటితో అభిషేకం నిర్వహించి, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు కొట్టి , కర్పూరతులు నిర్వహించడం జరిగింది గ్రామస్తులు రాత్రి బవులు భజన చేయడమే కాకుండా శనివారం మధ్యాహ్నం నుంచి కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని అనంతరం కొండ అవతల ఉన్నటువంటి గ్రామాలకు చెప్పులు లేకుండా దాదాపు 50 కిలోమీటర్ల మేర కాలినడకన భక్తి గీతాలు ఆలకిస్తూ ఈదులపల్లి రంగాపురం బండ్లపల్లి మరుతాడు దామనపల్లి తదితర గ్రామాల మీదుగ ప్రతి గ్రామంలోనూ భజన భక్తులను నీరు పోస్తూ ప్రతి వీధి వెంబడి ఆహ్వానించడం జరుగుతుంది అనంతరం తిరుగు ప్రయాణమై మరుసటి రోజు ఎగువపల్లె గ్రామానికి పది గంటలకు చేరుకుని ఊరు మొత్తం భజనలు చేస్తూ గ్రామం మధ్యలో ఉన్న బొడ్రాళ్ళకు నీరు దారపొస్తారు అనంతరం రామాలయంలో భజనలు చేసి భక్తి విరమణ చేస్తారు.

# వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు

**కూకట్పల్లి, జూలై 25 , (నవజ్యోతి ప్రతినిధి):**



తొలి ఏకాదశి సందర్భంగా హైదర్ నగర్ నిజాంపేట్ రోడ్డులోని సెవెన్ హిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆషాఢ శుక్ల ఏకాదశి నాడు శ్రీ మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్తాడని, ఈ రోజు నుంచే చాతుర్మాస దీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. ఉపవాసం, విష్ణు పూజల ద్వారా ఆరోగ్యం, ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తాయని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# పొద్దుటూరులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన...

- **అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేసి వంద శాతం ప్రక్రియ పూర్తి చేయాలి...**
- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి...**

**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, జూలై 25, (నవజ్యోతి పరిధి శివారెడ్డి) :**



శంకర్ పల్లి మండలంలోని పొద్దుటూరు గ్రామంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీనరసింహ, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఓటరు నమోదు ప్రక్రియ సాగుతున్న తీరును పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ పరిధిలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలను క్షుణ్ణంగా సేకరించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితాలో నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైనదని అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా మిగిలిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కొత్తగా అర్హత పొందిన యువత, చిరునామా మారిన వారు, పేర్లలో సవరణలు అవసరమైన వారు తప్పకుండా నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శంకర్ పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతంగా పూర్తి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉమ్మెత్తల శ్వేత వినోద్ కుమార్, కోటే ప్రశాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కవేలి జంగారెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, అలాగే ఓటరు నమోదు బాధ్యతలు నిర్వహిస్తున్న లాగల మల్లేశం, ముదిరాజ్ శ్రీనివాస్, జయశ్రీ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు, ఫారమ్‌లపై బిఎల్‌వోలకు ఎఈఆర్‌వో సూచనలు



**కూకట్పల్లి, జూలై 25 , ( నవజ్యోతి ప్రతినిధి)**

సమగ్ర ఓటర్ల సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా అల్లాపూర్ సొసైటీలోని భాగ్యనగర్ కాలనీలో జరుగుతున్న ప్రక్రియను ఎఈఆర్వో, డిసి చాముండేశ్వరి తనిఖీ చేశారు. ఆల్విన్ కాలనీ సర్కిల్ 51, శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బిఎల్వో లతో ఆమె స్వయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా నివాసాలు మారిన ఓటర్లకు సంబంధించిన షిఫ్టెడ్ ఫారమ్‌ల స్వీకరణ, నిర్వహణపై అధికారులకు స్పష్టమైన సూచనలు అందించారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని బిఎల్‌వోలను కోరారు.

# అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో నమోదు చేసుకోవాలి



ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు(తెల్లాపూర్),జూలై 25(నవజ్యోతి ప్రతినిది):**

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే బలమైన పునాది అని, అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్మెంట్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీతో పాటు ప్రచార రథాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని అన్నారు. ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రచార రథాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు, సంక్షేమానికి ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అందుకే ప్రతి అర్హుడైన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని కోరారు. అనంతరం ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాని మెడలు వంచిన యువత... కేంద్ర మంత్రి రాజీనామా..

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, జూలై 25:**

నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా ఏఐసీసీ పిలుపు మేరకు శనివారం రాత్రి కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ నుంచి నాకా చౌరస్తా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాజేందర్ రావు పాల్గొని విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం నాకా చౌరస్తా వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, దేశంలోని 40 కోట్ల మంది యువత ఒకవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోవైపు నిలిచిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శించినప్పటికీ, విద్యార్థులు, యువత వెనక్కి తగ్గకుండా పోరాడారని చెప్పారు. ఆ ఉద్యమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో కేంద్ర ప్రభుత్వం చివరకు దిగివచ్చి కేంద్ర మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి జరగలేదు

- **సర్పంచ్ తార్య నాయక్**
- **అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు.. రాజకీయ ఆరోపణలు నిరాధారం.**
- **ఆధారాలతో నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా సిద్ధం: సర్పంచ్ తార్య నాయక్**
- **రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారాలు మానుకోవాలి: తార్య నాయక్**
- **అర్హుల జాబితాను ప్రభుత్వానికే పంపాం.. అవినీతి ప్రశ్నే లేదు: తార్య నాయక్**

**రామాయంపేట, జులై 25 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**




మెదక్ జిల్లా రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతి జరగలేదని గ్రామ సర్పంచ్ తార్య నాయక్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను పూర్తిగా పాటిస్తూ పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్లు వెల్లడించారు.గ్రామంలో తొలి విడతలో తొమ్మిది ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేక చొరవతో మరో ఐదు ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం గ్రామసభ నిర్వహించి, గ్రామ ప్రజల సమక్షంలో నిజమైన నిరుపేదలను గుర్తించి, ఇందిరమ్మ కమిటీ సిఫార్సుల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు.

మూడో విడతలో ప్రభుత్వం 23 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో అర్హులైన నిరుపేదలకే ఇళ్లు కేటాయించామని స్పష్టం చేశారు.

తనపై వస్తున్న అవినీతి ఆరోపణలు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని తార్య నాయక్ ఆరోపించారు. కొందరు వ్యక్తులు కావాలనే అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.అలాగే, చట్టం పత్రికకు చెందిన విలేఖరి శివాజీ సర్పంచులు, అధికారులు మరియు ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తాను ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో లేదా ఇతర ఏ ప్రభుత్వ పథకంలోనైనా అవినీతికి పాల్పడ్డానని ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, ఎలాంటి విచారణనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు.అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, అలాంటి పరిస్థితుల్లో తాను పింఛన్లు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలు పుకార్లు, అసత్య ప్రచారాలను నమ్మకుండా వాస్తవాలను గుర్తించాలని, గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాలని సర్పంచ్ తార్య నాయక్ విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజీనామా

### పార్టీలో సరైన గుర్తింపు లేదని అసంతృప్తి.

**వాజేడు (నవ జ్యోతి ప్రతినిధి). జూలై 25**



వాజేడు మండలంలో సీనియర్ నాయకుడి రాజీనామాతో మండల కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు మరొక్కసారి వేడెక్కాయి. గత పది సంవత్సరాలుగా అధికారంలో లేకపోయినా పార్టీని వీడకుండా పనిచేసి అధికారం రావడం కోసం తన వంతు కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు కృషి చేసినా కూడా పార్టీలో సరైన గుర్తింపు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లె దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత ఏడు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులుగా పని చేశానని తెలియజేశారు. గత కొంతకాలంగా పార్టీలో జరుగుతున్నటువంటి విభేదాలే ఇందుకు కారణమని అన్నారు. అనంతరం ఆయన రాజీనామా లేఖలో ప్రస్తుత కాలంలో సంక్షేమ పథకాల విషయాల విషయంలో గాని పార్టీకి సంబంధించిన విషయాలలో గాని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వకపోవడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపారు. ఇటువంటి విషయాలను గూర్చి పై నాయకత్వానికి పలుమార్లు తెలియజేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని విసుగుచెంది రాజీనామా చేయక తప్పడం లేదని తెలిపారు. ఇట్టి రాజీనామాను ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆమోదించాలని లేఖలో పేర్కొన్నారు.

# చీరాల బొడ్రాయి మహోత్సవంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్

## ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు



**కీసర,జూలై 25,(నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని చీరాల గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద పూజలు చేసిన అనంతరం గ్రామ ప్రజలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్న ఆయన,గ్రామ ప్రజలందరికీ బొడ్రాయి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామంలో సుఖశాంతులు నెలకొని,రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని,ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బొడ్రాయి వంటి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని, ఇలాంటి పండుగలు గ్రామాల్లో ఐక్యత, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి,మాజీ కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్,డీసీసీ కార్యదర్శి నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్,రమేష్ గుప్తా,లక్ష్మణ్ శర్మ, మధుసూదన్ రెడ్డి,జీవన్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు జూలై 31 వరకు దరఖాస్తులు

## నవంబర్ 28న ప్రవేశ పరీక్ష – గ్రామీణ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉచిత విద్యా అవకాశం




**కీసర,జూలై 25,(నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2027–28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం జూలై 31, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు కె. మాధవరావు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహిస్తున్నామని, ఇందుకు ఎలాంటి దరఖాస్తు రుసుము లేదని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 40 సీట్లకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామని పేర్కొన్నారు.ప్రవేశ పరీక్షను నవంబర్ 28, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య,వసతి,భోజనం, పాఠ్యపుస్తకాలు,యూనిఫారాలు,వైద్య సౌకర్యాలు తదితర అన్ని సదుపాయాలు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అందించబడతాయని వివరించారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేయాలని ప్రధానాచార్యులు కె. మాధవరావు విజ్ఞప్తి చేశారు.

# రూ.49 లక్షలతో నాలా సేఫ్టీ ఫెన్సింగ్ పనులకు శ్రీకారం

## బండ్లగూడ–కేఎస్ఆర్ టౌన్‌షిప్ నాలా అభివృద్ధి పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**దమ్మాయిగూడ, జూలై 25, (నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయిగూడ 4వ డివిజన్ పరిధిలోని 5వ వార్డు బండ్లగూడ నుంచి కేఎస్ఆర్ టౌన్‌షిప్ వరకు రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న నాలా సేఫ్టీ ఫెన్సింగ్ పనులను దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పా రామారావు మాట్లాడుతూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నాలా పక్కన రక్షణ కంచె ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలను నివారించడంతో పాటు స్థానిక ప్రజలకు భద్రత కల్పించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,గోవింద్ సింగ్,దిలీప్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభారాణి,మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత,సంజీవ్ రెడ్డి,కీసర ట్రస్ట్ బోర్డు సభ్యుడు ప్రసాద్ గౌడ్, పోలు సాయి,కిట్టు,ఘౌస్ భాయ్,సుమేష్, ఎం.శ్రీనివాస్,జగన్,మాజీ కౌన్సిలర్ ముప్పా శ్రీలతతో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడ్చల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా అంజి రెడ్డి బాధ్యతలు స్వీకరణ

## ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**మేడ్చల్, జులై 23(నవజ్యోతి ప్రతినిధి )**



మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా (సీఐ) బాధ్యతలు స్వీకరించిన అంజి రెడ్డిని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయనను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా... గుండ్లపోచంపల్లి 299 డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్గుం డ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్ 299 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుంద భానుచందర్నా యకులు బండారి అనిల్లే బర్ సెల్ అధ్యక్షులు కావాలి భాస్కర్ఒ డ్డె ప్రవీణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన సీఐకి అభినందనలు తెలిపారు. ప్రజలకు సమర్థవంతమైన సేవలందించాలని ఆకాంక్ష ఈ సంద ర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లా డుతూ.. నూతన బాధ్యతల్లో అంజి రెడ్డి పూర్తి విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. మేడ్చల్ ప్రాంత ప్రజలకు మరింత సమర్థవంతమైన, మెరుగైన పోలీసు సేవలు అందుతాయని తాము విశ్వసిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# తొలి ఏకాదశి వేళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్న... శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ దంపతులు...

- ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన...

**ఉమ్మడి రంగారెడ్డి, జూలై 25, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ దంపతులు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించి శ్రీవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. భక్తులకు తొలి ఏకాదశికి ఉన్న ఆధ్యాత్మిక విశిష్టత ఎంతో గొప్పదని పేర్కొంటూ, భగవంతుని అనుగ్రహంతో సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొని ప్రజలందరూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తిరుమల శ్రీవారి దివ్య దర్శనం అనంతరం ఆలయ అధికారులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవారి కృప ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు నెలకొనాలని సాత ప్రవీణ్ కుమార్ దంపతులు భగవంతుడిని ప్రార్థించారు.

# మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకుంటుంది

- రాగి రాములు
- దేశ భద్రత, ప్రజల రక్షణే కేంద్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యత.
- భారత భద్రతకు విఘాతం కలిగించే వారిని చట్టం వదిలిపెట్టదు: రాగి రాములు
- జాతీయ ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలకు వెనుకాడదు.

**రామాయంపేట, జులై 25 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



దేశాన్ని అస్థిరపరిచే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం తలవంచదు – జాతీయ ప్రయోజనాల కోసం తీసుకునే ప్రతి నిర్ణయానికి భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుంది అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంపై కొందరు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే సాగుతోందని ఆయన విమర్శించారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు.దేశంలో అశాంతి, హింసాత్మక పరిస్థితులు సృష్టించి ప్రజల్లో గందరగోళం నెలకొల్పాలనే కుట్రలను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహించదని ఆయన స్పష్టం చేశారు. భారతదేశ సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల భద్రత మరియు దేశ స్థిరత్వాన్ని కాపాడడమే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికార రాజకీయాల కోసం కాకుండా, దేశ భవిష్యత్తు మరియు జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకుంటోందని రాగి రాములు తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం అవసరమైతే రాజకీయంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికైనా మోదీ ప్రభుత్వం వెనుకాడదని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు విద్యార్థులు, యువత, సామాన్య ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లాభం పొందాలని ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అలాంటి ప్రేరేపిత ప్రచారాలు, పుకార్లు, అసత్య సమాచారాన్ని ప్రజలు నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.గతంలో కూడా దేశ ప్రయోజనాల దృష్ట్యా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, అవసరమైనప్పుడు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ నిర్ణయాలు సవరించడానికీ వెనుకాడలేదని ఆయన గుర్తు చేశారు. దేశ శాంతి, భద్రత, అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కేంద్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అత్యున్నత ప్రాధాన్యతగా ఉంటాయని పేర్కొన్నారు. భారతదేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు ఎవరైనా చేసినా చట్టం తన పని తాను చేస్తుందని, దేశ భద్రతకు భంగం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు రాజకీయ రెచ్చగొట్టింపులకు లోనుకాకుండా దేశాభివృద్ధికి, సామాజిక సామరస్యానికి, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.చివరగా ఆయన మాట్లాడుతూ, "దేశం ముందు – పార్టీ తర్వాత. ప్రజల భద్రత ముందు – రాజకీయాలు తర్వాత. జాతీయ ప్రయోజనాలే భారతీయ జనతా పార్టీ మరియు మోదీ ప్రభుత్వ పరమావధి" అని పేర్కొన్నారు.

# నేడు కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం

- "కొమురవెల్లి అభివృద్ధికి మరో మైలురాయి...
- ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఆహ్వాన పత్రికల పంపిణీ

**నాగారం,జూలై 25,(నవజ్యోతి ప్రతినిధి) :**



సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి వద్దకు విచ్చేస్తున్న భక్తులకు నూతనంగా ఏర్పాటు చేసిన కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నడు జరగనున్న ప్రారంభోత్సవానికి అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేసి కార్యక్రమానికి విచ్చేయాలని నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్ ప్రారంభం ప్రాంత అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు.రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల భక్తులు, స్థానిక ప్రజలకు రవాణా సౌలభ్యం పెరగడంతో పాటు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఊతమిస్తుందని తెలిపారు.అందరి సహకారంతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలను నిర్వాహకులు కోరారు. "కొమురవెల్లి అభివృద్ధికి మరో మైలురాయి... అందరి సహకారంతో ఘన విజయమే లక్ష్యం" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కన్వీనర్,జిల్లా కార్యాలయ కార్యదర్శి,ఎం సి పల్లి బిజెపి మున్సిపల్ ఇంచార్జ్ గాలి సంపత్ యాదవ్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు తప్పెట్ల నరేందర్ గౌడ్,అద్రాస్ పల్లి కాంగ్రెస్ కౌన్సిలర్ ప్రభాకర్,బిఆర్ఎస్ నాయకులు మంధ స్వామి ముదిరాజ్,బిజెపి సీనియర్ నాయకులు చక్రపాణి,తాటి ఆనంద్ ముదిరాజ్,మూడు చింతలపల్లి బిజెపి నాయకులు బొప్పారం బాబు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ముఖం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో సీనియర్ జర్నలిస్ట్ ఎండి అస్లంకు ఘన సన్మానం

**మిర్యాలగూడ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)**



లోకల్ కేబుల్ వార్తల ప్రసారంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, అంతర్ముఖం సిల్వర్ జూబ్లీ–2026 వేడుకలను శనివారం మిర్యాలగూడ పట్టణంలోని, వైష్ణవి గ్రాండ్ సమావేశ మందిరంలో అంతర్ముఖం చైర్మన్ మర్రి ఎలియాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఖాజా హామీదుద్దీన్, నాగయ్యలతో పాటు సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి అస్లాం ను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అంతర్ముఖం చైర్మన్ మర్రి ఎలియాస్ లు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి నిరంజన్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, హెచ్‌డబ్ల్యూపీఎల్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలి

- గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీలు అందరూ ఏకం కావాలి - జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)



దేశంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీల హక్కుల సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీలను ఏకం చేసే లక్ష్యంతో ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద, జాతీయ ఓబీసీ మహాసభకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది జాతీయ ఓబీసీ మహాసభలను వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, నాగ్‌పూర్, హైదరాబాద్, తిరుపతి, అమృత్‌సర్, గోవా నగరాల్లో మహాసభలు నిర్వహించగా, ఈ ఏడాది బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశం నలుమూలల నుంచి వేలాదిమంది ఓబీసీ ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. జాతీయ సమావేశంలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడం, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించడం, జనాభా నిష్పత్తి ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచడం, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడం వంటి ప్రధాన డిమాండ్లపై చర్చించి భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ మరియు మహిళా బిల్లును ఆమోదింపజేయాలని ప్రయత్నిస్తోందని, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించకుండా ఈ బిల్లులను తీసుకురావడాన్ని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో వ్యతిరేకించి అడ్డుకోవాలని కోరారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా మహిళా బిల్లు, డీలిమిటేషన్ అమలు చేయడం వల్ల బీసీలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఇవి కేవలం అగ్రకులాల రాజకీయ ప్రయోజనాల కోసమే తీసుకొస్తున్న చర్యలని జాజుల లింగంగౌడ్ ఆరోపించారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బీసీ బిల్లును ప్రవేశపెట్టి, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య, బీసీ జేఏసీ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు గుండెబోయిన నాగేశ్వరావు యాదవ్, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్, బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, నియోజకవర్గ అధ్యక్షురాలు సందేనాబోయిన జయమ్మ, ఎస్సీ మహిళా జిల్లా అధ్యక్షురాలు చిత్ర ఉమా, బీసీ యువజన సంఘం నాయకులు ఎస్.పీ. నాయుడు, బంటు సైదులు ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజ్, రజక సంఘం నాయకులు గుండెపురి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరిక అంజయ్య, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ వీసా హబ్ కన్సల్ట్స్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు




మిర్యాలగూడ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)

పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఎస్ఆర్ వీసా హబ్ కన్సల్ట్స్ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లబోతు భాస్కర్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు విదేశీ విద్యను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. యూరప్‌తో పాటు ఇతర దేశాల్లోని ప్రభుత్వ, పబ్లిక్ యూనివర్సిటీల్లో లభించే తక్కువ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రాయితీలపై అవగాహన కల్పించి, విద్యార్థుల అర్హతలకు అనుగుణంగా ఉన్నత విద్యకు మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, పైలట్, ఎల్‌ఎల్‌బీ, కంప్యూటర్ సైన్స్, డేటా అనలిటిక్స్‌తో పాటు 10వ తరగతి ఉత్తీర్ణుల కోసం డిప్లొమా, హోటల్ మేనేజ్‌మెంట్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులకు కూడా విదేశీ విద్యా అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సీతా కోటేశ్వరరావు తీరంశెట్టి, రేపల్లె రమేష్, కొల్లా సైదులు, నజీర్, తాటికొండ జానకిరామ్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహ ధ్వంసంపై దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి

పోగుల సైదులు గౌడ్

మిర్యాలగూడ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)




హుజూర్‌నగర్ నియోజకవర్గం, చింతలపాలెం మండలం, చింత్రియాల గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటనను తెలంగాణ తెలుగు దేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో విగ్రహం బొటనవేలు విరిగిపోవడం బాధాకరమని పేర్కొంటూ తన విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇటువంటి సంఘటనలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన దుండగులను పోలీసులు వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విగ్రహాలకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వరుసగా ఎన్టీఆర్ విగ్రహాల ధ్వంసం జరుగుతుండటం వెనుక రాజకీయ కుట్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన పాలకులు, రాజకీయ ప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు, తర్వాత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుల్లో చాలామంది తెలుగుదేశం పార్టీ నుంచే ఎదిగారని గుర్తు చేశారు. ప్రతిసారి తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు తెలుగుదేశం పార్టీని సమైక్యవాదిగా చిత్రీకరించడం రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. అధికార పార్టీలోని కొందరు నాయకులు అవకాశం వచ్చినప్పుడల్లా తెలుగుదేశం పార్టీ నాయకత్వంపై విమర్శలు చేయడం తగదని, రాజకీయ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. హేయమైన చర్యలకు పాల్పడితే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణలో పటేల్–పట్వారీ వ్యవస్థను రద్దు చేసి, పేదలు, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. చివరగా, ఎన్టీఆర్ విగ్రహానికి జరిగిన అవమానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ, ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను డిమాండ్ చేశారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేగట్టే రవీందర్ రెడ్డి

వేములపల్లి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)



వేములపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ రేగట్టే రవీందర్ రెడ్డిని నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పున్న కైలేష్ నేత, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మిర్యాలగూడలో చైన్ స్నాచింగ్ నిందితుడు అరెస్ట్

- 9 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం
- నాలుగు రాష్ట్రాల్లో పలు కేసులు నమోదు

మిర్యాలగూడ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి)




పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళ మెడలోని సుమారు 9 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసిన చైన్ స్నాచింగ్ నిందితుడిని, మిర్యాలగూడ టౌన్ పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా అలియాస్ బిల్లా (27) యాక్టివా స్కూటీపై టోపీ, ముఖానికి కర్చీఫ్ ధరించి హౌసింగ్ బోర్డు కాలనీలోకి వచ్చాడు. ఓ మహిళను మాటల్లోకి దించి, ఆమె కరివేపాకు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లిన సమయంలో మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడి కదలికలను గుర్తించారు. మరో చైన్ స్నాచింగ్‌కు రెక్కీ నిర్వహిస్తున్న సమయంలో హనుమాన్‌పేట ఫ్లైఓవర్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు పుస్తెలతాడు, బంగారు చైన్లు, నల్లపూసల గొలుసు, యాక్టివా స్కూటీ, టోపీ, కర్చీఫ్, రెడ్‌మీ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో హత్యలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లకు సంబంధించిన పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును వేగంగా ఛేదించిన మిర్యాలగూడ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పీఎస్ఐ వెంకటేశ్వర్లుతో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి.

## బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం.




రామాయంపేట, జులై 25 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :

రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండమీది ప్రభాకర్ తల్లి అకాల మరణం చెందడంతో, బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు బానప్పగారి నర్సారెడ్డి ఈ విషయాన్ని కంఠరెడ్డి తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ పార్టీ నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుడుం శ్రీనివాస్, స్వామి, ఎర్ర సత్తయ్య, జీవన్ కుమార్, సీహెచ్ పోచయ్య, కర్రే అశోక్, బండమీది స్వామి తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం : కలెక్టర్ ప్రతిమా సింగ్
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు.
- వేలాది మంది విద్యార్థులకు ఆధునిక విద్యా వసతులు కల్పించనున్న యంగ్ ఇండియా పాఠశాల

రామాయంపేట, జులై 25 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :



రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు ప్రపంచంతో పోటీపడే స్థాయి విద్యను అందించేందుకు సమగ్ర చర్యలు చేపడుతోందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం రామాయంపేట పట్టణంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సంబంధిత అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.ముందుగా పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్, మ్యాప్‌లను పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణ పురోగతి, సాంకేతిక ప్రమాణాలు, పనుల నాణ్యతపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణంలో ప్రతి దశను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, అత్యుత్తమ ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రామాయంపేటలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. వేలాది మంది విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు, నివాస సౌకర్యాలు పొందేలా ఈ విద్యాసంస్థ రూపుదిద్దుకుంటోందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేసిన ఆమె, అవసరమైతే ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల సంఖ్యను పెంచి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పటిష్ట కార్యాచరణతో పనులను పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, డిజిటల్ విద్యా సదుపాయాలు, హాస్టళ్లు, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతులు అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిశీలనలో విద్య మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (EWIDC) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, రామాయంపేట తహసీల్దార్ రజని, సీఎంఓ రాజు, గణాంక అధికారి నవీన్, మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏఈ సఫితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# విద్యానగర్ లోని కలెక్టరేటు పార్కులో బుద్ధ విగ్రహం ఆవిష్కరణ

సంగారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):

సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కలెక్టరేటు పార్కు యోగసాధన కేంద్రంలో శనివారం బుద్ధ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, యోగా సాధకులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నిర్వాహకులను అభినందించారు. విగ్రహాన్ని అందించిన విశ్రాంత ఏఈ అంజయ్యతో పాటు ఉపాసన ధ్యాన ప్రేరణ వక్తను ప్రత్యేకంగా సన్మానించారు. అలాగే యోగసాధన కేంద్రంలో సేవలందిస్తున్న యోగా గురువులు జె. వెంకటేశ్వర్లు, కె. రాంరెడ్డిలను అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, భగవాన్ బుద్ధుని బోధనలు శాంతి, అహింస, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. యోగాభ్యాసం, ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రాహుల్ గాంధీ కా లడాయి... దేశ్ కే లియే బలాయి : జగ్గారెడ్డి



సంగారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటాలకు మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలో భారీ "రాహుల్ గాంధీ విక్టరీ ర్యాలీ" నిర్వహించారు. సంగారెడ్డి ఐబీ గెస్ట్ హౌస్ నుంచి పాత బస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ్ కుమార్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ "రాహుల్ గాంధీ కా లడాయి... దేశ్ కే లియే బలాయి" అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రాహుల్ గాంధీ పోరాటం దేశ ప్రజల కోసం, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం జరుగుతోందని అన్నారు. నీట్ పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల తరపున రాహుల్ గాంధీ నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రధాని నివాసం ఎదుట ధర్నా నిర్వహించిన తర్వాత ఉద్యమం మరింత ఉద్ధృతమైందని తెలిపారు. దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో పాల్గొనడం రాహుల్ గాంధీ పోరాటానికి నిదర్శనమని అన్నారు. దేశ ప్రజల సంక్షేమం, భద్రత, విద్యార్థుల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ఎప్పుడు పిలుపునిచ్చినా సంగారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమాలకు సిద్ధంగా ఉంటాయని, ఆయన ప్రధానమంత్రి అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ్ కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుత రాజకీయాలకు కట్టుబడి ఉంటుందని చెబుతూ, లాల్ బహదూర్ శాస్త్రి, మాధవరావు సింధియా వంటి నాయకులు నైతిక బాధ్యతతో రాజీనామా చేసిన సంఘటనలను ఉదాహరణగా ప్రస్తావించారు. అదే కాంగ్రెస్ పార్టీ రాజకీయ సంస్కృతి అని అన్నారు.

# పిల్లల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర
- ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థను పటిష్టం చేయాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




సంగారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):

పిల్లలకు సురక్షితమైన, హింసారహిత విద్యా వాతావరణాన్ని కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ జి. భవానీ చంద్ర పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ (నాల్సా) రూపొందించిన "చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీమ్–2024" అమలులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఒకరోజు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లాలోని 239 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 239 మంది ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, బాలలపై జరిగే వేధింపులు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మాదకద్రవ్యాల ప్రభావం, సైబర్ నేరాలపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో మార్పులను గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే బాలల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. విద్యార్థులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, మానసిక ఆరోగ్యం, బాలల హక్కులు వంటి అంశాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్యతో పాటు న్యాయమూర్తులు, జిల్లా విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రాణాలను కాపాడే సేవలో ఈసీఐఎల్..

# ప్రభుత్వాసుపత్రికి ఆధునిక అంబులెన్స్

- సీఎస్ఆర్ సేవల్లో మరో ముందడుగు.. మహబూబాబాద్ ఆసుపత్రికి ఈసీఐఎల్ అంబులెన్స్ బహూకరణ



కుషాయిగూడ, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి) :

అణుశక్తి విభాగం ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అత్యాధునిక అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్) అంబులెన్సును అందజేసింది. జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్, ఈసీఐఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) మరియు అదనపు డైరెక్టర్ (పర్సనల్) ప్రతీక్ కుమార్ చక్రవర్తి, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. శ్రీనివాస్ రావు సమక్షంలో అంబులెన్స్‌ను అధికారికంగా అందించారు. ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లాలో అధిక సంఖ్యలో గిరిజనులు ప్రభుత్వ వైద్యసేవలపైనే ఆధారపడుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు సాధారణ అంబులెన్స్ మాత్రమే అందుబాటులో ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు రోగులను తరలించాల్సి వచ్చేదన్నారు. నూతన అత్యాధునిక ప్రాణరక్షక అంబులెన్స్ అందుబాటులోకి రావడంతో అత్యవసర వైద్య సేవలు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందుతాయని పేర్కొన్నారు. ప్రతీక్ కుమార్ చక్రవర్తి మాట్లాడుతూ, ఈసీఐఎల్ సీఎస్ఆర్ కార్యక్రమాలు సమాజ సంక్షేమం, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకే అంకితమని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ఈ అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమానికి తోడ్పడే కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డా. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, జిల్లా ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడే అత్యాధునిక అంబులెన్స్‌ను అందించిన ఈసీఐఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఆరోగ్య రంగ అభివృద్ధికి మరిన్ని సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో డా. పి. వేణుబాబు (ప్రధాన వైద్య అధికారి, సీఎస్ఆర్ ఇన్‌చార్జ్), సునీల్ కుమార్,ఈసిఓఏ కోశాధికారి ఎం.శేషగిరిరావు,మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాపై చేతివాటం ప్రదర్శించిన ఏఈఓ..!

- రైతుకు రావాల్సిన రూ.90 వేల తన ఖాతాలో జమ.. విచారణలో గుర్తించిన అధికారులు.. సస్పెన్షన్ వేటు..!

కామారెడ్డి, జులై 25 (నవజ్యోతి ప్రతినిధి):

కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలో మొన్నటి వరకు వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)గా విధులు నిర్వహించిన మౌనికను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. రాజంపేటలో విధులు నిర్వహిస్తున్న సమయంలో రైతు భరోసా నిధులు రైతు ఖాతాకు చేరకుండా ఆమె బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు శాఖాపరమైన విచారణలో గుర్తించడంతో ఈ చర్యలు చేపట్టారు. రాజంపేట మండలం షేర్ శంకర్ తండాకు చెందిన గిరిజన రైతు కాట్రోత్ కిషన్‌కు చెందిన ఎకరం రెండు గుంటల భూమికి ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులు గత కొన్నేళ్లుగా తన బ్యాంకు ఖాతాలో జమ కాలేదని బాధిత రైతు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

విచారణలో రైతు కిషన్‌కు జమ కావాల్సిన రైతు భరోసా నిధుల్లో సుమారు రూ.90 వేల వరకు మౌనిక బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు అధికారులు గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా జిల్లా అధికారులు శాఖాపరమైన చర్యగా ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**రాజంపేటలో జరిగిన ఘటన.. భిక్కనూరులో సస్పెన్షన్**

మౌనిక రాజంపేటలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ ఘటన జరిగినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి వ్యవసాయ క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. అయితే రాజంపేటలో పనిచేసిన కాలానికి సంబంధించిన విచారణ పూర్తికావడంతో ప్రస్తుతం సస్పెన్షన్ చర్యలు అమలులోకి వచ్చాయి.



# విద్యానగర్ రోడ్ నెం.3లో నూతనంగా విమార్ట్ బ్రాంచ్-2 ప్రారంభం

సంగారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి) :

సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ రోడ్ నెం.3లో నూతనంగా ఏర్పాటు చేసిన విమార్ట్ బ్రాంచ్–2ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో మరో వ్యాపార సంస్థ ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు ప్రజలకు అందించడం ద్వారా స్థానిక వినియోగదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ వ్యాపారాభివృద్ధికి ఇటువంటి సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, అతిథులు స్టోర్‌ను సందర్శించి అందుబాటులో ఉన్న వస్తువులను పరిశీలించారు. నిర్వాహకులు వినియోగదారులకు ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పాల్గొని కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు, విశ్వసనీయ ఉత్పత్తులు అందించడమే తమ లక్ష్యమని విమార్ట్ నిర్వాహకులు వెల్లడించారు.



# బెంగళూరు బీసీ మహాసభకు సన్నాహాలు..

## సంగారెడ్డిలో పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి, జూలై 25 (నవజ్యోతి ప్రతినిధి):

ఆగస్టు 7న కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారత బీసీ మహాసభ పోస్టర్‌ను సంగారెడ్డిలో శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, టీజీఐఐసీ మాజీ చైర్మన్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేశ్, ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు ముఖ్య అతిథులుగా పాల్గొని మహాసభ ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీసీ యువత అధ్యక్షులు గోరుగంటి రమేష్ కుమార్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జగదీష్, లాడే బాలు, సోము, నాగేశ్‌తో పాటు ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, బీసీ సంఘాలు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీసీ వర్గాల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా మరియు ఉపాధి అవకాశాల పెంపు వంటి కీలక అంశాలపై బెంగళూరులో జరిగే అఖిల భారత బీసీ మహాసభలో విస్తృత చర్చ జరగనున్నట్లు తెలిపారు. బీసీ సమాజ అభ్యున్నతికి ఈ మహాసభ ఒక కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి బీసీ, ఉద్యోగ, విద్యార్థి, యువజన, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం చివరలో మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నాయకులు నినాదాలు చేశారు.



Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN